# గోదావరి సాక్షిగా...

-గజరావు సుశీల



మనసంతా అయోమయంగా వుంది!

బుర్రనిండా ముళ్ళకంచెలున్నట్లనిపిస్తోంది.

ఏదో తెలియని భయం, నిర్లిప్తతా కుదురుగా వుండనివ్వట్లేదు.

నాకెంతో ప్రీతి పాత్రమైన "ఉందిలే మంచి కాలం ముందు ముందునా" పాట - ఇప్పుడు నాకెందుకో రుచించట్లేదు! ఎందువల్లనో తెలీదు!

జీవితంలో ఎన్నో ఆశలు, ఆశయాలు! ఆశ తీరితే ఆశయాన్ని సాధించవచ్చు! కాని పైనున్న వాడు కరుణించపోతే జీవితం దుర్భరం!

మనసంతా పిచ్చి పిచ్చిగా, చికాకుగా అనిపిస్తోంది.

మంచి పదవుల్లో వుద్యోగం చేస్తూ, పైకి నీతులు వల్లించి నిరుపేదను సైతం లెక్కచెయ్యక 'లంచం' మింగేస్తున్న గోముఖ వ్యాఘ్రాల్ని చూస్తుంటే కక్ష, ప్రతీకారం కలుగుతోంది. ఎప్పట్నుంచో పెంచి పోషించుకున్న నిబద్ధత నన్ను ఇప్పుడు 'ఊగిపో, ఉరకలై, విప్లవాలు రేపెయ్, ఉద్యమించు' అని ప్రేరేపిస్తోంది.

కానీ సహనంతో తెలివితేటలతో ఏదైనా సాధించగలవు అని ఏదో శక్తి నా మనసుని శాంతపరుస్తోంది. అందుకే నన్ను నేను అదుపు చేసుకుంటున్నాను.

వ్యక్తిత్వం కోసం ఎన్నో జీవితాల అనుభూతుల్ని, స్పందనల్ని, కష్టాల్ని, కన్నీళ్ళని మనోనేత్రం అధ్యయనం చేశాను. డిగ్రీ పూర్తి చేశాను. కన్న తండ్రి "ఒరేయ్! నీకొకటి గతిలేదు. నీ సమున్నత ఆలోచనలతో అజ్ఞానపు మోడుల్ని చివురింప చేస్తావా? ప్రగల్భాలు, కవిత్వాలు, చదువూ మానేసి చక్కగా పౌరోహిత్యం చెయ్యరా!" అంటే ససేమిరా కుదర్దు అని తిరగబడ్డాను. తర్వాత పి.జి. చదువుదామనుకుంటే తండ్రి అకాల మరణానికి గురయ్యారు. ఏం చెయ్యాలి? దిక్కు తోచని స్థితి. నిరుద్యోగ పర్వంలో అనుభవాలు, అవమానాలు, సమస్యలూ మామూలే. వీటన్నింటికి మించిన పెద్ద బరువు ఈడొచ్చిన చెల్లెలు!

చెల్లాయి కుళాయి దగ్గర నీళ్ళు పడుతుంటే - రోడ్డు మీంచి పోతున్న ఆకతాయి కుర్రాళ్ళు చేసిన వెకిలి చేష్టలు - కామెంట్స్. ఇవన్నీ నా దగ్గర చెప్పుకున్నప్పుడు ఎంత కృంగిపోయానో. అక్కకి పెళ్లి చేసి ముందుగా నాన్న మంచిపనే చేశారు. ఇప్పుడు చెల్లాయి పెళ్ళి. ఉద్యోగం వస్తే కానీ ఆమెని సాగనంపలేను. అంతా తలుచుకుంటుంటే మనసంతా స్తబ్దుగా అయిపోతుంది. ఒక అధికారిని నమ్మి - అప్పుచేసి అయిదు వేలు లంచంగా ఇచ్చాను. ఉద్యోగం ఇచ్చాక మిగిలిన పైకం ఎలాగైనా ఇచ్చుకుంటానన్నాను. సరే అన్నారాయన.

నెలలు గడిచిపోతున్నాయి. ఆఫీసు చుట్టూ పిచ్చివాడిలా తిరుగుతున్నాను. ఓరోజు ఎలాగైతే అధికారి కనిపించారు. "ఉద్యోగం వేయిస్తానయ్యా! కంగారు పడితే ఎలాగయ్యా. రేపు కనిపించు" హుందాగా చెప్పారాయన.

కాకతాళీయంగా అరటి పండు తొక్క మీద కాలుపడి జారిపోయినట్లనిపించింది. ఇంకోరోజు -

"సార్! నాకు వుద్యోగం వద్దు సార్! మానసికంగా చాలా బాధల్లో వున్నాను. ఇంకా నన్ను ఇబ్బంది పెట్టకండి. నా డబ్బు నాకు ఇచ్చెయ్యండి సార్! ఏదైనా చిన్న వ్యాపారం చేసుకుంటాను" ప్రాధేయ పడ్డాను.

"ఏం డబ్బు?" ఆయన మొఖంలో కొండ వీటి చాంతాడంత ప్రశ్నార్థకం!

"అదేసార్, మీరు నాకు ఉద్యోగం ఇస్తానంటే అయిదువేలు ఇచ్చాను కదండీ అది" అన్నాను ఆత్రుతగా.

"ఓ అదా! మొన్న మా అమ్మాయి తన బర్త్‌డేకి గిఫ్ట్ కావాలని అడిగితే ఢిల్లీ వెళ్ళి ఓ మంచి ప్లాస్టిక్ బొమ్మ కొన్నానయ్యా. ఆ డబ్బు అలా ఖర్చయిపోయింది. ఉద్యోగం వేయిస్తానులే. ఏమీ బాధపడకు. టేకిట్ ఈజీ" మంచి నీళ్ళు తాగినంత సులువుగా ధైర్యం చెప్పసాగారు అధికారి.

నేను ఏదో చెప్పబోయాను.

ఇంతలో ఫోన్ మోగడంతో రిసీవర్ అందుకొన్నాడు.

అధికారిని చూస్తూ దిష్టి బొమ్మలా నిల్చున్నాను.

"మీరు ఏమీ వర్రీకాకండి! హెడ్డాఫీసుకి రాశాను. మీ కేండిడేట్‌కి వుద్యోగం గ్యారంటీ. మీ డబ్బు నా దగ్గర భద్రంగా వుంది! వుద్యోగం ఇవ్వలేక పోతే మీ డబ్బు మీకు తిరిగి ఇచ్చేస్తాను. ఆఁ ఆఁ ఏమీ బాధపడకండి. టేకిట్ ఈజీ! ఉద్యోగం వేయిస్తాను లెండి." చిన్నతనం నుంచి మాటల్ని ఔపోసన పట్టినంత అనుభవం, తార్కిక జ్ఞానం ఆయన మాటల్లో ధ్వనించాయి. 'ఫోన్లో మాట్లాడుతున్నాను కదా! మళ్ళీ కనిపించు' అన్నట్లుగా సైగ చేశాడు అధికారి. అంతే వెంటనే బయటకు వచ్చేశాను.

కళ్ళలో నీళ్ళు ఉబుకుతున్నాయి. నేను చూసిన సాంఘిక నాటకంలోని ఓ పాత్రధారి చేసిన మాయ మాటల హావ భావ విన్యాసం లీలగా కనిపిస్తోంది! ఆ పాత్ర ధారికీ ఈ అధికారికీ తేడా ఏమీ కనిపించదు. ఆ మాటల్లోని నాటకీయత, కృత్రిమత్వం స్పష్టంగా తెలిసిపోతుంది ఎవరికైనా. మనసు నుంచి వచ్చిన మాటలకీ - పెదవుల మీద నుండి వచ్చిన మాటలకీ వున్న తేడా తెలుసుకోలేనంత పిచ్చివాడ్ని కాదు. గులక రాళ్ళేస్తే గంగ పొంగిన వైనం, దాహం తీర్చుకొని హాయిగా పారిపోయిన కాకి కథనం అన్నీ తెలుసు. అన్నీ తెలిసే పప్పులో కాలేశాను! అప్పుచేసి లంచం ఇచ్చాను. అతడు నా దగ్గర తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చేస్తాడనే చిన్న నమ్మకం కలుగుతోంది. అంతకు ముందు అధికారి ఇచ్చిన విజిటింగ్

కార్డు నా జేబులో వుంది. అది బయటకు తీసి చూశాను.

"బి. పురుషోత్తమ రావు, బి.కాం, బి.ఎల్, బి. ఇడి (ఐ.ఎ.యస్) జనరల్ మేనేజర్" అని ఇంగ్లీషు అక్షరాలు!

అంత దుఃఖంలోనూ నాకు నవ్వొచ్చింది! అతగాడి మొదటి మూడు డిగ్రీలు బాగానే వున్నాయి. చివరన వున్న ఐ.ఎ.యస్.ని బ్రాకెట్‌లో పెట్టుకోవడం నాకు హాస్యాన్ని కలిగించింది. అతను కలెక్టర్ కాదు. డిప్యూటీ కలెక్టర్ అస్సలు కాదు. ప్రభుత్వంలోని ముఖ్య శాఖకు కమీషనరు అసలే కాదు. అతడు ఐ.ఎ.యస్. పరీక్షలకు అటెండ్ అయ్యాడన్న దానికి అది గుర్తు అని అటెండర్ చెప్పినప్పుడు పక పకా నవ్వుకున్నాను. ఎంత కీర్తి కాంక్ష! ఎందుకొచ్చిన పిచ్చిపనులు? అనుకొన్నాను.

పట్టువదలని విక్రమార్కుడిలా మరుసటిరోజు వెళ్ళి "నా డబ్బు నాకు ఇప్పించండి సార్! ఏదైనా చిన్న వ్యాపారం చేసుకుంటాను" అన్నాను.

"రేపు రావయ్యా, నీ డబ్బు నీకు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను" అన్నాడాయన చాలా నిజాయితీగా.

"థాంక్యూ సార్, ఎన్ని గంటలకు రమ్మంటారు? నా మాటలు వినకుండానే ఏదో పని వున్నట్లు స్ప్రింగ్ డోర్ తెరుచుకొని లోపలికి వెళ్ళిపోయాడు అధికారి. కుంచించుకుపోయాను. ఆ డోర్ నన్ను వెక్కిరిస్తున్నట్లు అనిపించింది. వెనుతిరిగాను.

మరుసటి రోజు ఆఫీసుకెళ్ళి "జి.యమ్ గారున్నారా?" అడిగాను అటెండర్ని. "నిన్ననే జి.యమ్‌గారు హైదరాబాదు పోయినారు. ఆయనొచ్చే తలికి వారం రోజులు అయితది" చెప్పాడు అటెండర్.



నిరాశతో నిర్లిప్తంగా వెనక్కి తిరుగుతూ "దాహంగా వుంది. ఇక్కడ మంచినీళ్ళెక్కడ వున్నాయండి"? అడిగాను అటెండర్ని.

"జి.యమ్ గారి రూమ్ పక్కన్నుంచి ఆ కడకు పోతే అక్కడ కూజా వుంటది" అన్నాడు. అక్కడికి వెళ్ళి మంచినీళ్ళు తాగి వచ్చేస్తుంటే గోడకున్న కిటికీలోంచి - "మీరేం వర్రీకాకండి! మీ డబ్బు భద్రంగా వుంది. ఆః ఆః డోన్ట్ బాదర్ ఎబౌట్ ఇట్! మీ వాడికి జాబ్ గ్యారెంటీ అన్నాను కదా" అన్న మాటలు స్పష్టంగా వినిపించాయి. అవే మాటలు! మాయమాటలు! తను వూరెళ్ళానని అటెండర్‌తో చెప్పించడం ఎంత మోసం! నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది. సహనాన్ని పక్కకు నెట్టాను. నేను చదివిన సాహిత్య ప్రక్రియల్ని, సిద్ధాంతాల్ని - అందులో వున్న దోపిడీ వ్యవస్థనీ తిరిగి మననం చేసుకున్నాను.

"దిక్కు మొక్కులేని జనం ఒక్కొక్కరు అగ్నికణం" అని స్పందించాను మనసులో!

"నేను సైతం విశ్వవీణకు తంత్రినై మూర్ఛనలు పోతాను" అనుకొన్నాను. ఆవేశంతో జి.యమ్. రూమ్ వైపు కదిలాను. ఆయన దగ్గరికెళ్ళి మాయ మాటలు చెప్పిన ఆయన గొంతుని చీరెయ్యాలనిపిస్తోంది. కాని రూమ్ దగ్గరకెళ్ళి స్ప్రింగ్ డోర్ తెరవకుండానే వెనక్కొచ్చేశాను.

వాడ్ని చంపేస్తే, ఆ రక్తం బొట్లు బొట్లుగా పడి, అందులోంచి ఎన్ని దుష్ట శక్తులు పుట్టుకొస్తాయో అని భయం. ఆగిపోయి ఆలోచించడం మొదలు పెట్టాను. మోస పోయాను. ఘోరంగా మోసపోయాను. తప్పు నాదేనేమో! మళ్ళీ బాగా ఆలోచించాను. అటెండర్ని నిలదీస్తే నేనూహించిన నిజం బయట పడింది. 'మీరు వస్తే - జి.యమ్. గారు వూరెళ్ళారని చెప్పమన్నా'రని అటెండర్ చెప్పేశాడు. నిర్లిప్తంగా బయటకొచ్చాను. ఏమీ సాధించలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ.

ఆకలేస్తోంది! నిన్న రాత్రి మిగిలిన రూపాయి పెట్టి గోదారిగట్టు మీదున్న బడ్డీ కొట్టు దగ్గరకెళ్ళి రెండు చిన్న ఇడ్లీలు, పల్చని టీ తాగి ఆకలి చల్లార్చుకున్నాను. ఇప్పుడు జేబులో చిల్లి గవ్వలేదు.

ఇప్పుడు నాకు నన్ను మోసం చేసిన వాడ్ని చంపాలని లేదు. కక్ష, ద్వేషం అస్సలు లేవు. ఆకలి తీర్చుకోవాలని ఆశగా వుంది. దిక్కు మొక్కులేని వాడికి తిండి వుండదు. ఎముకలు మాడి పోతాయి. గుండె మూగబోతుంది. గొంతు ఆరిపోతుంది. అలాంటప్పుడు వాడు అగ్ని కణం ఎలా అవుతాడు? మంచుకణం అవుతాడు.

కడుపులో అన్నం నింపుకొని ఆకలిన్ని జయించాలని ఒక ఆలోచనకి వచ్చి - పేపరు మిల్లు దగ్గరకొచ్చాను.

ధవళేశ్వరం వెళ్ళే బస్ అక్కడ ఆగుతుంది. ధవళేశ్వరంలో అక్క, బావవున్నారు. అరగంట ఓపికపడితే ఆకలి తీర్చుకోవచ్చు!

మిర్తిపాడు నుంచి ధవళేశ్వరం వెళ్ళే బస్ పేపర్ మిల్ స్టాప్‌లో ఆగింది. బస్ ఎక్కేశాను. టిక్కెట్టు తీయలేదు. నేను చదువుకున్న చదువు, అది నేర్పిన సంస్కారం, క్రమ శిక్షణ ఇవన్నీ నా ఆకలి ముందు ఎందుకూ పనికిరాలేదు. అవన్నీ విస్మరించి దొంగచాటుగా బస్ ఎక్కి ఓ మూల నక్కి నిల్చున్నాను.

మిట్ట మధ్యాహ్నం! ధవళేశ్వరం మార్కెట్ దగ్గర దిగి రథం వీధి వైపునకు నడక సాగించాను. అంబేద్కర్ విగ్రహం ప్రక్క నుంచి జన సందోహం నినాదాలతో బయలుదేరుతోంది. వాళ్ళు ఎవరు? ఏమిటి? అని ఆరా తీస్తే - వాళ్ళంతా కవులూ, విప్లవ కారులు అని చెప్పాడు ఓ వ్యక్తి!

ఇంతలో పెద్ద పెద్ద నినాదాలు వినిపించాయి!

"లంచగొండితనం నశించాలి"

"దోపిడీ వ్యవస్థ ముక్కలవ్వాలి"

చాలా ఉద్వేగంగా గొంతు చించుకుంటున్నారు. ఎంత ఎదశక్తి నష్టం! ఆలోచించుకుంటూ అసహనంగా ముందుకు పోయాను.

అక్క ఇల్లు వచ్చేసింది.

"ఏరా తమ్ముడూ! అలా వున్నావేమిట్రా? నీ వుద్యోగం విషయం ఏమయ్యింది." అంది అక్క ఆత్మీయత నిండిన స్వరంతో.

ఆ మాటలు చాలా చిరాకుగా అనిపించాయి. సమాధానం చెప్పడానికి మనసు పిచ్చి పిచ్చిగా వుంది. "ఆకలేస్తుంది, అన్నం పెట్టు" అన్నాను.

అక్క నా వైపు తీక్షణంగా చూసి - "భోజనం తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళిపోయింది. ఇంతలో బయట నుంచి చిట్టి తల్లి వచ్చింది. అది అక్క కూతురు. వయసు పది. ఆర్టిస్టు పాణి గీసిన చిన్న పిల్ల బొమ్మలా పుష్టిగా అందంగా వుంది. దాని పేరు వాగ్దేవి! కానీ ఇంట్లో అందరూ చిట్టి తల్లి అంటూంటారు.

"మావయ్యా!" అంది చిట్టి తల్లి సుస్వరాల వీణానాదంలా.

"ఏం కావాలే చిట్టి?" అన్నాను.

మౌనం వహించింది. ఏదో అడగాలనుకుంది చిట్టి తల్లి!

'నాకు స్వీట్లు తెచ్చావా?' అని అడుగుతుందేమోనని భయం వేసింది.

"ఏం లేదు. మావయ్యా! నువ్వు మంత్ర పుష్పం చదివితే చాలా బావుంటుంది. ఒకసారి చదవవా?" అంది ప్రేమగా.

చదవటానికి మనసులేదు. ఎప్పుడు పడితే అప్పుడు మంత్ర పుష్పం చదవకూడదు! అంతకు మించి చదవటానికి ఒంట్లో సత్తువలేదు. కానీ చిట్టి అంటే నాకు ప్రాణం, ఇష్టం. అందుకే చదవాలనిపించింది. 'సరే చదువుతాను' అన్నాను. ప్రారంభించాను.

యోపాం పుష్పం వేదా! పుష్పవాన్ ప్రజావాన్ పశుమాన్భవతి!

చంద్రమావా అపాం పుష్పం పుష్పవాన్ ప్రజావాన్ పశుమాన్భవతి!

"మావయ్యా! గొంతు అపశృతి పలుకుతోంది. పుష్పం తరువాత అన్ని గమకాలు వుండవు" అంది చిట్టి తల్లి.

"నిజమే! మనసు వేదం మీద లగ్నం కావట్లేదు" అన్నాను గిల్టీ ఫీలవుతూ.

చిట్టి తల్లికి వాగ్దేవి అనిపేరు అందుకే పెట్టారు కాబోలు. అది చాలా తెలివైన పిల్ల! లోపల్నించి అక్క వచ్చింది.

"ఒరేయ్. పది నిమిషాలు ఓపిక పట్టరా. అప్పడాలు వేయిస్తున్నాను." అని చెప్పి మళ్ళీ లోపలికెళ్ళింది అక్క.

ఒంటి మీదున్న చొక్కా విప్పి- "అక్కా! సోప్ వుందా?" అన్నాను.

"ఎందుకురా?" అడిగింది అక్క లోపల్నుంచి.

"తెల్ల చొక్కా బాగా దుమ్ము పట్టి నల్లగా అయిపోయింది. ఉతుకుదామని"

"అలా వుంచు. నేను వుతికి ఆరేస్తాను"

"లేదు. నేనే ఉతుక్కుంటాను"

"ఒరేయ్ నీకు చాదస్తాలు ఎక్కువరా!" అంది అక్క చిరాగ్గా.

"నా చాదస్తాలు నావి. నన్ను ఇబ్బంది పెట్టకు" అన్నాను.

చొక్కా ఉతికేసి గోడమీద ఆరేశాను.

గోదావరి పక్కనే వుందేమో. గాలి బాగానే వేస్తోంది.

త్వరగా ఆరిపోతే భోజనం చేసి ఇంటికి వెళ్లిపోదామనే వుంది.



అక్క అన్నం పెట్టింది. అన్నం తింటున్నాను. చిట్టి తల్లి తన మాటలతో కంపెనీ ఇస్తూంటే ముద్దలు ఆనందంగా గొంతుదాటుతున్నాయి.

పెరుగు కలుపుకుంటూంటే - "మావయ్యా నువ్వు చొక్కా ఉతికావు కదా." అడిగింది చిట్టి తల్లి.

"ఆఁ ఉతికేను. గాలి బాగా వీస్తోంది. ఈపాటికి ఆరిపోతుంది" అన్నాను.

"నువ్వు చాలా తెలివి తక్కువవాడివి మావయ్యా" అంది చిట్టి తల్లి. కోపం రాలేదు. ఆ మాటలకి ఆశ్చర్యపోతూ వెంటనే "ఏం. ఎలా?" అన్నాను.

"చొక్కా ఆరేసి దాని మీద బరువు పెట్టలేదు. అప్పుడు చొక్కా ఎలా ఆరుతుంది?"

"ఏం ఎందుకు ఆరదు. ఖచ్చితంగా ఆరుతుంది. కాకపోతే గాలికి కిందపడిపోతుంది. అంతే"

"కింద ఏముందో తెలుసా?"

"ఏముంది?"

"కాలువ. అందులో పడుతుంది. మళ్ళీ చొక్కా తడిసి తీరుతుంది." అనగానే కంగారుగా పైకి లేచాను, ఎంగిలి చేత్తో.

కత్తితో నరికేసిన కొమ్మ కొద్ది క్షణాల్లో కిందికి జాయిపోయినట్లు - ఆ చొక్కా ఇంకొంచెం గాలి వీస్తే కింద పడిపోడానికి సిద్ధంగా వుంది. అంతే. ఎంతో వేగంగా చొక్కాను పట్టుకున్నాను. నావెనకే చిట్టి తల్లి వచ్చింది. విలువైన వస్తువు దక్కించుకున్నంత ఆనందం కలిగింది. చిట్టి తల్లిలో ఎంత సమయస్ఫూర్తి, తెలివి తేటలు వున్నాయి! ఈ వయస్సులో ఆపిల్లకి అంత ప్రతిభా!" మనస్సులో అనుకుంటూ చిట్టి తల్లిని ముద్దు పెట్టుకున్నాను.

ఆ సంఘటన నుంచి. చిట్టి తల్లి దృక్పథం నుంచి ఎన్నో సత్యాలు తెలుస్తున్నట్లు అనిపించింది. అవి జీవితానికి ఖచ్చితంగా అన్వయించుకో వచ్చనే ఫిలాసఫీతో మనసు ఝల్లుమని స్పందించింది. నన్ను నేను విశ్లేషించుకోవడం మొదలు పెట్టాను.

అక్క దగ్గర డబ్బులడిగి బస్ ఎక్కి తిరిగి ఇంటికొచ్చేశాను. ఆ తరువాత ఒక్కసారి కూడా నేను పురుషోత్తమ రావుని కలవలేదు.

"నా డబ్బు నాకిచ్చెయ్యండి" అని అస్సలనలేదు. నీదోపిడీని అరికడతానని గొంతు చించుకోలేదు. ఉద్యమాలు అస్సలే లేవదీయలేదు. బాగా ఎండిపోయిన గడ్డి పోచ మండుతున్న మంటలో పడితే ఎలా నామ రూపాలు లేకుండా పోతుందో బాగా తెలుసు!

అందుకే ఆ మరుసటి రోజు నుంచి కొత్త జీవితాన్ని ప్రారంభించాను!

గోదావరి ఒడ్డున అపర కర్మలు చేయడం మొదలు పెట్టాను!

ప్రభుత్వాలు మారడాలు. అధికారుల ఆగడాలు ఇవేవీ చదవట్లేదు! కవిత్వాలు కాకరకాయలూ రాయడం మానేశాను! మౌనమైపోయాను గోదావరి సాక్షిగా!

చనిపోయిన వ్యక్తి తాలూకు మనషులొచ్చి కోటిలింగాల రేవులో కర్మ కాండ చేయిస్తారు. చనిపోయిన ఆత్మ శాంతించాలని, పాప పంకిలమైన దేహపు బూడిదని పవిత్ర గోదావరిలో పారబోస్తారు. ఆ మనుషుల్నే నమ్ముకున్నాను.

సంవత్సరం తర్వాత ఓ రోజు - ఓ వ్యక్తి

గోదావరి గట్టుమీదకొచ్చి - నా పేరు అడిగాడు. చెప్పాను.

"మా నాన్నగారు చనిపోయారు. రేపు కర్మకండ చెయ్యాలి" అన్నాడు నిర్లిప్తంగా.

"మీ నాన్నగారి పేరు?" అడిగాను.

"పురుషోత్తమరావు!" టక్కున చెప్పాడు.

ఆ పేరు నా జీవితంలో మర్చిపోలేని పేరు! ఆ పాత్ర విశ్వవేదికపై అద్భుతంగా నటించి అవార్డు గెలుచుకోగలదు! అందుకే ఆ పేరు నాకింకా గుర్తుంది.

"ఏం చేస్తూండేవారు మీ నాన్నగారు?" ఆత్రుత తట్టుకోలేక అడిగేశాను.

"ఫలానా కంపెనీలో జి.యమ్‌గా పని చేస్తూండేవారు సడన్‌గా పోయారు"

అవును! నన్ను మోసం చేసి అయిదు వేలు మింగేసిన ఆ పురుషోత్తమరావు ఈ పురుషోత్తమరావు ఒక్కడే!

"అయ్యో! ఆయన చనిపోయారా?" బాధగా నిట్టూర్చాను!

"ఆయన మీకు తెలుసా?" ఆయన కొడుకు ప్రశ్నించాడు.

"తెలుసు" అన్నాను.

వివరాలు అడిగితే చెప్పాను. కాని ఆయన నన్ను మోసం చేసిన ఉదంతాన్ని మాత్రం చెప్పలేకపోయాను. బాధలోంచి తేరుకొని - "ఆయనకు జబ్బు చేసిందా?" అడిగాను.

ఆయన కొడుకు ఎందుకో చెప్పడానికి తడబడుతున్నాడు.

ఆ కుర్రాడి పక్కన మరొక కుర్రాడు వున్నాడు. అతడు అతగాడి స్నేహితుడనుకుంటా! అతడు చెప్పాడు.

"ఆఫీసులో ఏదో గొడవ జరిగింది. ఎవరో వ్యక్తి వీళ్ల నాన్న గార్ని హత మార్చాడు"

ఆ మాటలకు మ్రాన్పడి పోయాను. "రామా! ఎంత ఘోరంగా తీసుకెళ్లిపోయావు ఆయన్ని!" అనుకున్నాను లోలోపల.

ఒకప్పుడు మాయమాటలు చెపుతున్న ఆయన గొంతుని చీరెయ్యాలని వుద్వేగపడ్డాను. అది నిజం అయి తీరింది!

గుండెలోంచి దుఃఖం పొంగు కొచ్చింది. వాళ్లని పంపించేశాను. రేపు కర్మ కాండ చేస్తానన్నాను!

గోదావరి సాక్షిగా - బి. పురుషోత్తమరావు, బి.కాం, బి.ఎల్. బి.ఇడి (ఐ.ఎ.యస్) గారి ఆత్మ శాంతించాలని మనసులో అనుకొని - "శ్రీ వాణీ గిరిజాశ్చిరామ దధతోం వక్షోము ఖాంజ్ఞేష, యేలోకానాం స్థితి మావ హస్త్య విహితాం..." అని శివుడ్ని స్తుతిస్తూ వుండిపోయాను, గోదావరి గట్టు మీద!